తీరనున్న బస్తీవాసుల సమస్య

టెస్టింగ్‌కు సిద్ధమవుతున్న రిజర్వాయర్ పనులు పరిశీలించిన అధికారులు

జూబ్లీహిల్స్, నవంబర్ 13 : బస్తీల ప్రజల దాహార్తి తీర్చేందుకు గత తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన భారీ రిజర్వాయర్ త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్ పీఆర్ హిల్స్ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ తీరేలా 3 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన భారీ రిజర్వాయర్‌కు నాడు రూపకల్పన చేశారు. ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఈ భారీ రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్నారు. తెలంగాణ ఆవిర్భావానికి ముందు అతి తక్కువ జనాభా ఉన్న ఈ ప్రాంతంలో వారం.. పది రోజులకోసారి వాటర్ ట్యాంకర్లతో నీళ్ళిచ్చిన అధికారులు.. తెలంగాణ వచ్చిన తరువాత ఇక్కడి జనాభా గణనీయంగా పెరగడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా గావించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బోరబండలోని 6 ఎంఎల్ రిజర్వాయర్‌కు అనుబంధంగా ఎస్‌పీఆర్ హిల్స్‌లో 1 ఎంఎల్ రిజర్వాయర్‌తో ప్రతిరోజు 10 లక్షల లీటర్ల నీటిని పంపింగ్ చేస్తూ నీటి సరఫరా చేస్తున్నారు. కాగా దశాబ్దాలుగా వెనుకబడిన ఈ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలకు చెక్ పెడుతూ బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్‌లలో ఉన్న 56 బస్తీలలోని సుమారు 15 వేల మందికిపైగా జలమండలి వినియోగదారులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్ పీఆర్ హిల్స్‌లో రిజర్వాయర్ పనులను ఇటీవల జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్-1 సుదర్శన్, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్‌తో కలిసి పరిశీలించారు.



టెస్టింగ్ పనుల కోసం రిజర్వాయర్ లోపల పనులను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

టెస్టింగ్‌కు సిద్ధం చేస్తున్నాం

– హరిశంకర్, జలమండలి జీఎం, డివిజన్-6

రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్ రిజర్వాయర్‌ను నీటితో నింపి టెస్టింగ్ పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నాము. బోరబండ రిజర్వాయర్ నుంచి ఎస్‌పీఆర్ హిల్స్ రిజర్వాయర్ వరకు 600 ఎంఎం డయా పైప్‌లైన్ పనులు చేపట్టనున్నాం. రోడ్డు కటింగ్ అనుమతుల అనంతరం సుమారు 1 కిలోమీటరు పొడవున ఈ పైపులైన్ పనులు చేపడతాము. పనులు పూర్తిచేసి నగరంలో అందరికీ అందిస్తున్న మాదిరిగా ఈప్రాంత వినియోగదారులకు రోజు విడిచి రోజు నీళ్ళిస్తాం.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ : కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో మంజూరైన 16 చెక్కులను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ..పేదలకు సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందరికీ దక్కేలా చూస్తామన్నారు. – బంజారాహిల్స్, నవంబర్ 13

రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తే చర్యలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 13: రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే తగిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ సూచించారు. బుధవారం సాయంత్రం అత్తాపూర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న వారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఫుట్‌పాతులను ఆక్రమించి పానీపురి, పండ్ల బండ్లు, ఇతర సామగ్రిని అమ్ముతున్న వారికి చలా న్లు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల నిమిత్తం రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. కొంద రు చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లను యథేచ్ఛగా ఆక్రమించి వ్యాపారులు చేసుకుంటున్నారన్నారు. వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ కూడా జామ్ అవుతుందన్నారు. ఇలా చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

హైదర్‌గూడలో రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారికి జరిమానా విధిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్

కుటుంబ సర్వేలో.. ఇబ్బందులు ఎదురవుతున్నాయా..

కార్మికనగర్‌లో ఆరా తీసిన డిప్యూటీ సీఎం కార్యాలయ ప్రతినిధులు

జూబ్లీహిల్స్,నవంబర్13: సమగ్ర కుటుంబ సర్వేను డిప్యూటీ సీఎం కార్యాలయ ప్రతినిధులు నవికా హర్షే, దీప్తి తదితరులు పరిశీలించారు. బుధవారం యూసుఫ్‌గూడ సర్కిల్ కార్మికనగర్‌లో చేపడుతున్న సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేలో ఏమైనా సమస్యలున్నాయా.. ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అధికారులను, ఎస్‌హెచ్‌జీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, సర్కిల్ నోడల్ ఆఫీసర్.. డీపీఓ వెంకటకిషన్ రావు, ఈఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సర్ధార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 13: ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న సర్ధార్ వల్లభాయ్ పటేల్ కేసరి 6వ కుస్తీ పోటీలకు భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు నారగూడెం మల్లారెడ్డి, గొరిగే రాజు పైల్వాన్‌లు పేర్కొన్నారు. బుధవారం రాంబాగ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కుస్తీ పోటీల ఏర్పాటు పనులను వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15,16,17 తేదీల్లో మూడు రోజుల పాటు సర్ధార్ వల్లభాయ్ పటేల్ కేసరి 6వ కుస్తీ పోటీలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, గోషామహల్ ఎమ్మె ల్యే రాజా సింగ్‌లు హాజరుకానున్నారన్నారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి, తిలకించడానికి జంట నగరాల నుంచి అనేక మంది ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొంటారని గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పి.మల్లేష్‌యాదవ్, విజయ్‌కుమార్, పి.సుధాకర్‌రెడ్డి, విజయ్ రావత్, గురు, అనిల్ పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి కుస్తీ పోటీల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు నారగూడెం మల్లారెడ్డి తదితరులు

పుస్తె, మెట్టెలు అందజేత

వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన చాకలి పాండు కూతురు పెళ్లికి మంగళసూత్రం, మెట్టెలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ గొల్ల స్వరూపనాగేష్‌యాదవ్

మణికొండ, నవంబర్ 13 : సేవ చేయాలన్న సంకల్పం అందరిలో ఉండకపోవచ్చు..అన్నీ ఉన్నా సేవ చేసే భాగ్యం కూడా అందరికి దొరకదు. కానీ ఆ గ్రామంలోని ప్రతి పేద ఇంటిలో పెళ్లి భాజాలు మోగితే చాలు...ఆ కుటుంబం ముందుకొచ్చి మేమున్నామంటూ చేయూతని చ్చేందుకు వస్తారు. పూర్తి వివరాలల్లోకి వెళితే... నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగుల పల్లి గ్రామ మాజీసర్పంచ్ గొల్ల స్వరూప, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొల్ల నాగేష్‌యాదవ్ దంపతులు గత ఐదేళ్లుగా పేదల ఇంటి పెళ్లికి పుస్తె,మెట్టెలను ఉచితంగా అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన చాకలి పాండు కుమార్తె వివాహానికి బుధవారం పుస్తె, మెట్టెలు మాజీసర్పంచ్ స్వరూపనాగేష్ అందజేశారు.

18 వరకు డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

హిమాయత్‌నగర్,నవంబర్13: డిగ్రీ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 18వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించాలని బాబూ జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్ష ఫీజును క్యూ ఆర్ కోడ్,ఆన్‌లైన్, నేరుగా గాని చెల్లించుకునే అవకాశం ఉందన్నారు.రూ. 500 అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు చెల్లించవచ్చని తెలిపారు.

ఎంపీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మూ డో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నిత్య అన్నదాన పోస్టర్ ఆవిష్కరణ



అత్తాపూర్‌లో నిత్య అన్నదాన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 13: సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎంతో పుణ్యం కలుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్‌లో ముద్దగౌని భాస్కర్‌గౌడ్, ముద్దగౌని మల్లికార్జున్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిత్య అన్నదాన కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి డిసెంబర్ 15 వరకు ఈ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములు, భక్తులు ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడి రవికుమార్‌గౌడ్, కె.గోపిగౌడ్, సంతోష్, ఎం.రవీందర్‌గౌడ్, ఎం.మధుబాబు, లింగ ప్ప, భీమేశ్వర్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

డా.శ్రీపూజకు జేసీఐ ఎక్సలెన్స్ అవార్డు

బంజారాహిల్స్,నవంబర్ 13: క్లినికల్ సైకాలజీలో విశేష ప్రతిభ కనబర్చిన ప్రముఖ వైద్యురాలు డా.శ్రీపూజ సిద్దంశెట్టికి జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అలుమినీ క్లబ్ ప్రతిష్టాత్మకంగా అందజేసే ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో క్లినికల్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డా.శ్రీపూజ సేవలను గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేయగా నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమెకు జేఏసీ జాతీయ ప్రతినిధులు సునీల్‌కుమార్ రుమల్లా, వినయ్‌మెహతాలు అవార్డును అందజేశారు. మానసిక ఆరోగ్యం, విద్య తదితర అంశాలలో తాను చేసిన కృషితో ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన తనకు జేసీఐ ఎక్సలెన్సీ రావడం సంతోషంగా ఉందని డా.శ్రీపూజ అన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ జీవీఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న క్లినికల్ సైకాలజిస్ట్ డా. శ్రీపూజ

రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో

ఉచిత వైద్య శిబిరం

విద్యార్థులకు దృష్టి సమస్యలు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సికింద్రాబాద్ బాలమ్రాయి జీపీఎస్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో 'పుష్ప గిరి విట్రియో రెటీనా ఇనిస్టిట్యూట్'.. 'మా ఈఎన్‌టీ హాస్పటల్' సహకారంతో విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో 309 మంది విద్యార్థులకు స్క్రీనింగ్‌లను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ రొటేరియన్లు కుమార స్వామి, హనుమంత రెడ్డి పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్

అధ్యాపకురాలు అరుణకుమారికి డాక్టరేట్



హిమాయత్‌నగర్,నవంబర్ 13: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భౌతిక శాస్త్ర అధ్యాకులుగా పనిచేస్తున్న అరుణ కుమారి రాజస్థాన్‌లోని జబర్మల్ టిబ్రివాలా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు.డాక్టర్ గంగాధర్ పర్యవేక్షణలో ఫైనైట్ ఎలిమెంట్,అనాలసిస్ ఇన్ ఫెయిల్యూర్ అనాలసిస్,క్రాక్ స్టెబిలిటీ ఇన్ మెటల్ అలాయిస్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు.బుధవారం కాలేజీ ఆవరణలో అరుణకుమారినిని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ప్రశంసించి సన్మానించారు.

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలి

డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతి ప్రతం అందజేస్తున్న నాయకులు

ఖైరతాబాద్, నవంబర్ 13 : ఎస్సీ, ఎస్టీల జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు చెట్లపల్లి అరుణ్ కుమా ర్ కోరారు. బుధవారం ఐక్య వేదిక యువజన విభాగం అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు, బీఆర్ఎస్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ రావుల విజ య్ కుమార్, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్‌తో కలిసి హైకోర్టు మాజీ న్యాయమూర్తి, వన్‌మెన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణను సంపూర్ణంగా వ్యతిరేకిస్తున్నామని, ఆర్టికల్ 341, 342 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడు క్యాటగిరీలలో ఉప వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వర్గీకరణ ఫలాలను 57 ఉపకులాలకు సమానంగా అందించాలన్నారు. జస్టిస్ షమీ మ్ అక్తర్ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో వారి సూచనలు పరిశీలించి తగిన న్యాయం చేస్తామన్నారు. వన్‌మెన్ కమిషన్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు మన్నెగూడెం వేణుగోపాల్, సివిల్ సప్లై కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మణికొండ, నవంబర్ 13: రక్తదానం ప్రాణదానంతో సమానం అని మహాత్మాగాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎంజీఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత ముఖ్యంగా సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 90 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు రక్తదానం చేశారన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ సాయి వైద్యశాల వైద్యులు డాక్టర్ శ్రవంతి, ప్రకాశ్, రంజిత్, సారంగ పాణిలు, లయన్స్ క్లబ్ సభ్యులు అమన్, విజయలక్ష్మి, లయని, అరుణ, ధర్మేందర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ జె.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి

కార్తీక దీపోత్సవాలకు ఆహ్వానం: మణికొండ మున్సిపాలిటీ వాసవీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న అల్కాపూర్ ఎంజీ పార్కులో కార్తీక దీపోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్తీక దీపోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – మణికొండ, నవంబర్ 13

భార్యపై భర్త దాడి

బంజారాహిల్స్,నవంబర్ 13: కుటుంబ కలహాల కారణంగా భార్యపై కక్ష పెంచుకున్న భర్త ఆమెపై కర్రతో దాడి చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..రాజేంద్రనగర్‌లోని డెయిరీ ఫార్మ్‌కు చెందిన రేష్మాబేగం(30)కి అబ్దుల్ రవూఫ్ అనే వ్యక్తితో పెళ్లయింది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కాగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా మూడేళ్ల క్రితం రేష్మాబేగం విడిపోయి పిల్లలతో కలిసి అదే ప్రాంతంలో ఉంటోంది. కాగా ఏడాది క్రితం అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మునావర్ హసన్ ఖాన్ అనే వ్యక్తితో పరిచయం ప్రేమగా మారి రేష్మాబేగంను ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన తర్వాత రేష్మాబేగంను వేధింపులకు గురిచేయడంతో పాటు ఆమె పిల్లలను కూడా సరిగా పట్టించుకోవడం లేదు. దీంతో అతడిని వదిలిపెట్టి పిల్లలతో కలిసి మరో ఇంట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో టోలిచౌకి సమీపంలోని హకీంపేటలోని తన తల్లి ఇంటికి వచ్చిన రేష్మాబేగంను వెంబడిస్తూ వచ్చిన మునావర్ జానకీనగర్ వద్దకు రాగానే రాయితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రేష్మాబేగం ఆస్పత్రిలో చేరింది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ 118(1), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో నవవధువు ఆత్మహత్య

బండ్లగూడ, నవంబర్ 13: అనుమానాస్పద స్థితిలో నవ వధువు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం ప్రకారం.. కామారెడ్డి మద్నూర్‌కు చెందిన సిద్ధేశ్వరి వివాహం ఏడు నెలల కిందట అత్తాపూర్ రాంబాగ్ చెందిన ప్రవీణ్‌తో జరిగింది. ప్రవీణ్ ఒక బంగారం దుకాణంలో పని చేస్తుండగా.. సిద్ధేశ్వరి ఇంట్లోనే ఉంటున్నది. మంగళవారం సాయంత్రం భర్త ప్రవీణ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆమె.. ఆ తర్వాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రవీణ్ ఇంటికి వచ్చి చూడగా.. ఆమె ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, తన కూతురు ఆత్మహత్యకు అతడే కారణమంటూ సిద్ధేశ్వరి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పటోలా మేళా ..భళా !

ఆకట్టుకుంటున్న డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబర్ 1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటుంది. వెడ్డింగ్ ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా ఏర్పాటైన ఈ ప్రదర్శనలో రాజ్కోట్ , పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట్లు, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు ఒకే వేదికలో మగువల మనస్సును దోచేస్తున్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 16 వరకు కొనసాగుతుందని డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మక్వానా తెలిపారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మంచి మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యం అని వివరించారు.

మైనార్టీలంటే కాంగ్రెస్ పెద్దలకు చిన్నచూపు ఎందుకు?

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు హాజీ, సీనియర్ నేత రిజ్వాన్ సిద్దీకి

మణికొండ, నవంబర్ 13 : నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీలో దళితులకు, మైనార్టీలకు తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ గ్రామ అధ్యక్షుడు హాజీ, సీనియర్ నేత రిజ్వాన్ సిద్దికీలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దకాలంగా పార్టీ కోసం అవిశ్రాంతంగా శ్రమించి పనిచేస్తే మైనార్టీ, దళిత వర్గాలను గుర్తించకుండా పార్టీ పెద్దలు అవమాన పర్చారంటూ వారు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వెలిబుచ్చారు. నార్సింగి వ్యవసాయ మార్కెట్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉందని అలాంటి మార్కెట్‌లో పశువుల సంత అధికంగా నిర్వహించేది మైనార్టీలు, దళిత వర్గాలకు చెందిన వారేనని గుర్తుచేశారు. అలాంటి మా వర్గాల ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నామన్నారు. తమకు మార్కెట్ కమిటీలో స్థానం కల్పించాలని నియోజకవర్గ నాయకులకు విన్నవించినా ప్రయోజనం లేదని వారు వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జూబ్లీహిల్స్, నవంబర్ 13 : విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా గురువారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీ డీ ఏడీఈ గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణానగర్ సబ్‌స్టేషన్ మీనాక్షి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. టీవీ 5, ఇంద్ర నగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరక